# బీఆర్ఎస్ చరిత్ర సృష్టించడం ఖాయం




స్వరాష్ట్రం కోసం మలిదశ ఉద్యమంలో పాల్గొన్నాం. ఉద్యమ నేత కేసీఆర్ అడుగుజాడల్లో పనిచేశాం. అంతా అనుకున్నట్లుగానే తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకున్నాం. కొట్లాడి సాధించుకున్న తెలంగాణను అభివృద్ధి పరచడంలోనూ అంతే శ్రద్ధ వహించాం. 50ఏండ్ల సమైక్య పాలనలో జరగని అభివృద్ధిని.. బీఆర్ఎస్ తొమ్మిదిన్నరేండ్ల పాలనలో చేసి చూపించాం. తాగునీటి గోస తీర్చాం. రోడ్లను విస్తరించాం. నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దాం. సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే బిగాల కృషితో ఇందూరును అభివృద్ధిలో నంబర్ వన్‌గా తీర్చిదిద్దాం. ప్రజలకు తెలుసు.. అభివృద్ధి ప్రదాతలకే పట్టం కడతారని అంటున్నారు నుడా మాజీ చైర్మన్, తెలంగాణ ఉద్యమకారుడు చామకూర ప్రభాకర్‌రెడ్డి. నమస్తే తెలంగాణ ప్రత్యేక ఇంటర్వ్యూ ఆయన మాటల్లోనే..

\- ఖలీల్‌వాడి, నవంబర్ 14

- **అభివృద్ధి ప్రదాతకే ప్రజలు పట్టం కడతారు..**
- **ఇందూరు నగరం మాణిక్యంగా మారింది**
- **మా నేత కేసీఆర్ ముందు ఇతర పార్టీలు గల్లంతు**
- **బీఆర్ఎస్ హయాంలో విద్యుత్ కాంతుల్లో నగరం**
- **నుడా మాజీ చైర్మన్, తెలంగాణ ఉద్యమకారుడు చామకూర ప్రభాకర్‌రెడ్డి**

### అర్బన్‌లో బీఆర్ఎస్‌కు పోటీ ఎవరు?

బీఆర్ఎస్‌కి పోటీ అనేదే లేదు. మా నాయకుడు ముఖ్యమంత్రి కేసీఆర్ కటౌట్ ఒక్కటి చాలు. ఇతర పార్టీలు గల్లంతు అవ్వాల్సిందే. గత 50ఏండ్లలో ఇతర ప్రభుత్వాలు చేయనిది, సీఎం కేసీఆర్ తెలంగాణ వచ్చిన తర్వాత తొమ్మిదేండ్లలో చేసి చూపించాడు. అందుకే ప్రతిపక్షాలకు భయం పుట్టింది. నీళ్లు, నిధులు ఇంటింటికీ తీసుకువచ్చారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రాజెక్టు కాళేశ్వరం నిర్మించి రైతుల పొలాలకు నీళ్లను అందించి బీడు భూములను సస్యశ్యామలం చేశారు. ఒక్కసారి ఇందూరు చుట్టూ ఉన్న భూములను చూస్తే తెలుస్తుంది. గతంలో ఎట్లుండే...ఇప్పుడు ఎలా ఉన్నాయి. పచ్చని పంటలతో కళకళలాడుతున్నాయి.

**నగరంలో బీఆర్ఎస్ చేసిన అభివృద్ధి ఎలా ఉన్నది..**

**చామకూర ప్రభాకర్ రెడ్డి:** బీఆర్ఎస్ అంటేనే అభివృద్ధి. పదేండ్లలో నిజామాబాద్ నగరం చాలా అందంగా తయారైంది. 2001 నుంచి ఉద్యమంలో ఉన్నాను. రాష్ట్రం కోసం ఎన్నో పోరాటాలు చేశాం. సీఎం కేసీఆర్ దీక్షతో తెలంగాణని సాధించుకున్నాం. సాధించుకున్నట్టే తెలంగాణతో పాటు నిజామాబాద్‌ను అభివృద్ధి చేశాం. గత ప్రభుత్వాలు చేసిందేమీ లేదు. నగరంలో చేసిన అభివృద్ధి కండ్లకు కట్టినట్లు కనబడుతున్నది. నిజామాబాద్‌కు ఐటీ హబ్ వస్తుందని కలలో కూడా ఊహించలేం. అలాంటి ఐటీ హబ్ నిజామాబాద్‌లో ఏర్పాటు చేసి 700 మందికి ఉద్యోగాలు ఇచ్చిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిది. బిగాల గణేశ్ గుప్తా నిజామాబాద్ ప్రజలకు సేవా చేయాలనే ఉద్దేశంతో ఎమ్మెల్యేగా వచ్చి నగర రూపురేఖలు మార్చారు. గత ప్రభుత్వాలు 40ఏండ్లు పాలించాయి. ఏ ప్రభుత్వమైనా ఇంత అభివృద్ధి చేసిందా? ఇందూరుని మణిమాణిక్యంగా మార్చిన ఎమ్మెల్సీ కవిత, ఎమ్మెల్యే బిగాలకు ప్రత్యేక కృతజ్ఞతలు.

**బీఆర్ఎస్ మార్క్ అభివృద్ధి ఏమిటి ?**

రోడ్లను విస్తరించాం. డివైడర్లు ఏర్పాటు చేసి, మధ్యలో మొక్కలు నాటి ఆహ్లాదకర వాతావరణం ఏర్పడేలా చేశాం. వీధులన్నీ ఎల్ఈడీ లైట్ల వెలుగులు విరజిమ్ముతున్నాయి. గత పాలకులు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను మధ్యలోనే వదిలేస్తే... అధికారంలోకి వచ్చిన తర్వాత బిగాల గణేశ్ గుప్తా పట్టువదలని విక్రమార్కుడిలా పనులను పూర్తిచేశారు. సీఎం కేసీఆర్ సహకారంతో నూతన సమీకృత కలెక్టర్ భవనాన్ని నిర్మించాం. మున్సిపల్ కార్యాలయం, విద్యుత్ భవన్, ఐటీ హబ్, న్యాక్ బిల్డింగ్ ఇలా ప్రభుత్వ కార్యాలయాలన్నీ సొంత భవనాల్లో ఉండేలా చేశాం. మినీ ట్యాంక్ బండ్, మాడ్రన్ వైకుంఠధామాలు, ఆర్‌యూబీ పనులను పూర్తి చేసి ట్రాఫిక్ కష్టాలను తీర్చాం.

**బీఆర్ఎస్ పథకాలపై ప్రజల స్పందన ఎలా ఉన్నది..**

పథకాలతో బీఆర్ఎస్ ప్రభుత్వం మరోసారి చరిత్ర సృష్టించనున్నది. సంక్షేమ పథకాల్లో దేశంలోనే నంబర్ వన్ అయిన కల్యాణలక్ష్మి , షాదీముబారక్ పథకం ఏ పార్టీలకు రాని ఆలోచన. మా ముఖ్యమంత్రి కేసీఆర్‌కు వచ్చింది. ఆడబిడ్డకు రూ.లక్షా116 అందించి ఆదుకుంటున్న మహనీయుడు. రైతుబంధు ద్వారా రైతులని, దళిత బంధు ద్వారా దళితులని, బీసీబంధు, మైనార్టీ బంధు ఇలా అన్నివర్గాలకూ సమన్యాయం చేస్తున్నారు.

**కాంగ్రెస్, బీజేపీల పరిస్థితి ఏమిటి?**

కాంగ్రెస్ పార్టీకి అర్బన్‌లో అభ్యర్థులు దొరకడంలేదని కామారెడ్డి నుంచి తీసుకువచ్చారు. బీజేపీ నామినేషన్ల ముందు అభ్యర్థులను ప్రకటించుకునే పరిస్థితి వచ్చింది. గతంలో ఓటమిపాలైన అభ్యర్థిని మళ్లీ నిలబెడుతున్నారు. బీఆర్ఎస్ మాత్రం నెలరోజుల ముందే అభ్యర్థులను ప్రకటించుకొని ప్రచారంలో దూసుకుపోతున్న దమ్మున్న పార్టీ. మా నాయకుడు దమ్మున్న నాయకుడు.



### సీఎం కేసీఆర్ పాలనపై ప్రజలు ఏమనుకుంటున్నారు..?

నిజామాబాద్ నగరంలో 60డివిజన్లు ఉన్నాయి. అందులో నూడా ఉన్నది. గతంలో నేను నుడా చైర్మన్‌గా పనిచేశాను. ప్రతి డివిజన్‌లో సీసీ రోడ్లు వేశాం. గతంలో ట్యాంకర్ల ద్వారా నీటిని తీసుకువచ్చేవాళ్లు.. మేము అధికారంలోకి వచ్చిన తర్వాత ఇంటింటికీ నల్లా కనెక్షన్లు ఇచ్చాం. బొడ్డెమ్మ చెరువు ఇప్పుడు మినీ ట్యాంక్‌బండ్‌గా తయారైంది. ప్రభుత్వ దవాఖానలో సిటీ స్కాన్, టీహబ్ ద్వారా రోగ నిర్ధారణ పరీక్షలు, క్యాథ్ ల్యాబ్ సేవలు అందుబాటులోకి తీసుకువచ్చాం. ఇలా ప్రతి రంగంలో అభివృద్ధి చేశాం. వీటన్నింటినీ చూస్తున్న ప్రజలు కేసీఆర్ అంటే మాకు, మా జీవితాలకు భరోసా అని చెబుతున్నారు.

---

## వేముల సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరికలు



బీఆర్ఎస్‌లో చేరిన వారితో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

వేల్పూర్, నవంబర్ 14 : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు, అమలుచేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీలకు చెందిన నాయకులు బీఆర్ఎస్‌లో చేరుతున్నారు. తాజాగా భీమ్‌గల్ మండలం బడాభీమ్‌గల్‌లోని ఛాలెంజ్ యూత్, రజక రాయల్స్ యూత్, కమ్మర్‌పల్లి మండలం హాసాకొత్తూర్ గ్రామ నాయక్‌పోడ్ సంఘ సభ్యులు (20 కుటుంబాలు), వేల్పూర్ మండలం అంక్సాపూర్ గ్రామం నుంచి సుంకెట చిన్న మల్లారెడ్డి ఆధ్వర్యంలో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి సమక్షంలో మంగళవారం బీఆర్ఎస్‌లో చేరారు. వారికి మంత్రి వేముల గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

**సొంతగూటికి ఎంపీటీసీ..**

మోర్తాడ్ ఎంపీటీసీ గరిసే శాస్త్రి తిరిగి బీఆర్ఎస్‌లో చేరారు.కొద్ది రోజుల క్రితం కాంగ్రెస్ పార్టీలో చేరిన ఆయన ఘర్ వాపసి అయ్యారు. సీఎం కేసీఆర్ పాలనలోనే సబ్బండ వర్ణాలు సంతోషంగా ఉంటాయని భావించి తిరిగి సొంత గూటికి చేరారు.

**మంత్రి వేములకు మద్దతుగా ఏకగ్రీవ తీర్మానాలు**

బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డికి సంపూర్ణ మద్దతు తెలుపుతూ పలు గ్రామాల్లో ఏకగ్రీవ తీర్మానాలు చేస్తున్నారు.ఇందులో భాగంగా బడాభీమ్‌గల్ గ్రామానికి చెందిన సుమారు 50 మంది సభ్యులతో కూడిన ఛాలెంజ్ యూత్ ఏకగ్రీవ తీర్మానం చేసింది. ఇందుకు సంబంధించిన తీర్మాన కాపీని మంత్రికి వేల్పూర్‌లో మంగళవారం అందజేశారు. వేల్పూర్‌లోని మంత్రి నివాసంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## ఆర్మూర్ ఏఎంసీ మాజీ చైర్మన్ మృతి



దశరథ్‌రెడ్డి (ఫైల్)

భీమ్‌గల్, నవంబర్ 14 : ఆర్మూర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ భీమ్‌గల్ మండలం చేంగల్‌కు చెందిన మామిడి దశరథ్‌రెడ్డి (71) మంగళవారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందినట్లు మాజీ సర్పంచ్ సంగెం అనంతరావు, కుటుంబ సభ్యులు తెలిపారు. దశరథ్‌రెడ్డి 12 ఏండ్లు చేంగల్ గ్రామ సర్పంచ్‌గా, మండల మొదటి ఉపాధ్యక్షుడిగా, రైతు సేవా సహకార సంఘం, భీమ్‌గల్ చైర్మన్‌గా, జడ్పీటీసీ సభ్యుడిగా సేవలందించారు. టీడీపీ హయాంలో మాజీ మంత్రి మహిపాల్‌రెడ్డికి ప్రధాన అనుచరుడిగా ఉన్నారు. తర్వాత బీఆర్ఎస్‌లో మూడు పర్యాయాలు రాష్ట్ర కార్యదర్శిగా పనిచేశారు. ఆయన అంతిమయాత్ర బుధవారం ఉదయం నిజామాబాద్‌లోని గంగస్థాన్ ఫేస్ -2 లోని శ్రీసాయి భువన అపార్ట్‌మెంట్ నుంచి మొదలవుతుందని కుటుంబ సభ్యులు తెలిపారు.

## రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక

బాల్కొండ, నవంబర్ 14 : మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల విద్యాలయానికి చెందిన నలుగురు విద్యార్థినులు రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు ప్రత్యేకాధికారిణి జి.భవాని తెలిపారు. సబ్‌జూనియర్ రాష్ట్రస్థాయి ఈనెల 15 నుంచి 17 వరకు మెదక్ జిల్లా తుప్రాన్‌లో నిర్వహించనున్న పోటీల్లో ఉమ్మడి జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు పీఈటీ స్రవంతి తెలిపారు.